క్లుప్తంగా

105 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవసల: పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఎస్‌బీఐ ప్రధాన శాఖ కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి శ్రీకాకుళం మెడికవర్ హాస్పిటల్ వైద్యులు సేవలు అందించారు. బ్యాంకు సిబ్బంది, పెన్షనర్లు, కస్టమర్లకు బీపీ, సుగర్, ఈసీజీతోపాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ సుశాంత్ కుమార్, సిబ్బంది, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వి.రమణ పాల్గొన్నారు.

తరలిరండి



ఆమదాలవలస: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో గురువారం నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ అనుంధ విభాగాలకు చెందిన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత పేద విద్యార్థుల కోసం చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా పార్టీ క్యాడర్ అంతా కృషి చేద్దామన్నారు. ఉదయం 9 గంటల కల్లా ప్రతి ఒక్కరూ నర్సీపట్నం చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



నవదీష

పాతపట్నం: శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు(అండర్-17) బుధవారం ఎంపికలు నిర్వహించారు. కీపర్, బ్యాట్స్ ఉమన్‌గా పాతపట్నం శివానీ నగర్‌కు చెందిన జంజిక నవదీష ఎంపికైందని పీడీ ఎన్ని శేఖర్‌బాబు (పాతపట్నం హైస్కూల్) తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన జిల్లా క్రికెట్ సెలక్షన్స్‌లో నవదీష ఎంపికై విశాఖపట్నంలో మ్యాచ్‌ల్లో పాల్గొని సత్తా చాటింది. నవదీష తండ్రి జంజిక శ్రీనివాసరావు మెళియాపుట్టి మండలం పెద్ద లక్ష్మీపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు. తల్లి మణి మెళియాపుట్టి మండలం అచ్చనాపురం ఎంపీపీఎస్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. నవదీషకు పీఈటీలు జె.కృష్ణ, ఎస్.కృష్ణారావు, కోచ్ లోకేశ్వరరావు అభినందనలు తెలిపారు.

నిమజ్జనం..



నందన్న విగ్రహం

కొత్తూరు: మండల కేంద్రంలో నందన్న నిమజ్జన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. నందన్న విగ్రహాన్ని కొత్తూరులోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు నందన్నను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చింద్రాడ వరప్రసాదరావు ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది కొరత!

- పీహెచ్‌సీల్లో పోస్టులను భర్తీచేయని కూటమి ప్రభుత్వం
- రాష్ట్ర సరిహద్దు గిరిజన ప్రాంతంలో ఉన్న పీహెచ్‌సీల్లో అరకొరగా సేవలు
- ఇబ్బంది పడుతున్న రోగులు



24 గంటలూ వైద్య సేవలు అందజేస్తున్న బైదలాపురం పీహెచ్‌సీ



చాపర పీహెచ్‌సీ

పాతపట్నం: కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పాలకులు గొప్పలు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగానే ఉంది. ఏ చిన్న జబ్బు చేసినా పేదలకు గుర్తొచ్చేది సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే. అంతటి ప్రాముఖ్యమున్న పీహెచ్‌సీల్లో సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా సిబ్బందిపై అదనపు భారంతోపాటు రోగులకు సకాలంలో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది.

పీహెచ్‌సీల్లో పోస్టుల కొరత ఇలా..

పాతపట్నం నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీలు ఉన్నాయి. పాతపట్నం మండలంలో బైదలాపురం పీహెచ్‌సీలో 10, గంగువాడలో 6, మెళియాపుట్టి మండలంలో మెళియాపుట్టిలో 7, చాపర 7, కరజాడలో 6, కొత్తూరు మండలంలో కురిగాంలో 6, మెట్టూరులో 6, హిరమండలం మండలంలో హిరమండలంలో 8, చొర్లంగిలో 6, ఎల్.ఎన్.పేట మండలంలో ఎల్.ఎన్.పేటలో 7, తురకపేటలో 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాతపట్నం, కొత్తూరులో ఒక్కో సీహెచ్‌సీ ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించలేదు. ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై పనిభారం పెరగడంతోపాటు ఆ ప్రభావం వైద్య సేవలపై పడుతోంది.

ప్రభుత్వ నిబంధనలు ఇవే..

ప్రభుత్వ జీఓ ప్రకారం పీహెచ్‌సీలో 14 మంది వైద్య సిబ్బంది పనిచేయాలి. 24 గంటలు వైద్య సేవలు అందించే బైదలాపురంలో ఇద్దరు వైద్యాధికారులు ఉండాలి. ఇక్కడ మాత్రం ఒక్క వైద్యాధికారి సత్యవాణి మాత్రమే ఉన్నారు. స్టాఫ్ నర్సులు ముగ్గురు ఉండాలి. ఉన్న ఒక్కరు కూడా ట్రైనింగ్‌కు వెళ్లారు. ఉదయం 9 గంటలకు డ్యూటీకి వచ్చే రాత్రి 8 గంటల వరకు ఉండాల్సి వస్తోంది. రాష్ట్ర సరిహద్దు గిరిజన ప్రాంతమైన బైదలాపురం పీహెచ్‌సీలో సిబ్బంది లేకపోవడంతో గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. రక్తపరీక్షలు చేయడానికి ఇక్కడ సిబ్బంది (ఎల్‌టీ) కూడా రెండు నెలలుగా నియమించలేదు. దీంతో ఒడిశా రాష్ట్రానికి వైద్యం కోసం వెళుతున్నారు. చాపర పీహెచ్‌సీ పరిధిలో 38 వేల మంది జనాభా ఉన్నారు. ఒక సీహెచ్‌సీలో ఎనిమిది మంది సిబ్బంది ఉండాలి. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఎల్‌టీ, ఫార్మసిస్ట్, అటెండర్ ఉండాలి. ఇప్పటికైనా ప్రభుత్వం పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే ఖాళీలను భర్తీ అయ్యే అవకాశముంది. సిబ్బంది కొరత ఉన్నా సంతృప్తికరంగా వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.కళ్యాణబాబు, డీసీహెచ్‌ఎస్, శ్రీకాకుళం

అన్నదాతను ఆదుకోవాలి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: పంట పొలాలను పరిశీలిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నం/హిరమండలం: ఇటీవల మహేంద్రతనయ నదికి వచ్చిన వరదలతోపాటు వర్షాలకు వరి పంట పాడైందని, రైతులను కూటమి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండలంలోని కాపు గోపాపురం, హరిజన గోపాలపురం, హిరమండలం మండలంలోని జిల్లోడిపేట, కల్లట గ్రామాల్లో నీటి మునిగిన వరి, తదితర పంటలను రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. వరి పంట నీటిలో మూడు, నాగులు రోజులుగా ఉండడం వల్ల పూర్తిగా కుళ్లిపోయిందని రైతులు వివరించారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ.. వరి పంట నీట మునిగి పూర్తిగా పాడైనా ఈ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. వరి పంట రైతులకు ప్రధానమైనదని, ఈ పంట రాకపోతే ఇబ్బంది పడతారన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. పార్టీ పాతపట్నం మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, నాయకులు ఎరుకొల వెంకటరమణ, గొకవలస రాము, పడ్డ నేతాజీ, తూలుగు ప్రవీణ్, సవిరిగాన మమత, ఎన్ని రామారావు, లుకలాపు రామచంద్రరావు, రెగాల ధర్మారావు, కలమట జనార్దనరావు, కొరుకొండ కృష్ణ, ఎన్ని చిరంజీవులు, గొర్లె ప్రసాదరావు, పార్టీ హిరమండలం మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, సర్పంచ్ లావేటి లీలావతి, నాయకులు లోలుగు లక్ష్మణరావు, లుకలాపు ప్రసాద్, యు.మన్మధరావు, బలగ నాగేశ్వరరావు, అప్పారావు, నక్క ఆనందరావు, కన్న బాబు, భాస్కరావు, శ్రీనివాస్, తాతబాబు, లోకేష్, రవిబాబు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్న గ్రేస్ శాంతి

హిరమండలం: ఫిజియోథెరపీ ప్రత్యేకావసరాల గల పిల్లలకు వరమని, క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటామని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవరావు అన్నారు. భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్ట్ గ్రేసీ శాంతి చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఐఈఆర్టీ సిబ్బంది సీతంనాయుడు, గోవిందరావు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో మానసికోల్లాసం

హిరమండలం: ప్రాథమిక స్థాయి నుంచే మంచి ఆహారపు అలవాట్లు ఉండాలని, యోగా, ధ్యానం వంటివి మానసికంగా దృఢత్వాన్ని ఇస్తాయని మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడు అంపిలి ప్రశాంత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రశాంత్‌కుమార్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కొన్నిరకాల ఆరోగ్య సూత్రాలను పాటించడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం కేశవరావు మాట్లాడుతూ మంచి నడవడికతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కోరాడ కాలనీ, కేజీబీవీ విద్యాలయంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం



మాట్లాడుతున్న కృష్ణచైతన్య

సారవకోట: గ్రామ కమిటీలతో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయనున్నట్లు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య తెలిపారు. మండలంలోని సారవకోటలో కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. సారవకోట క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సారవకోట, కుమ్మరిగుంట, గొరిబంద పంచాయతీలకు చెందిన గ్రామస్థాయి కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆ తరువాత హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన డిజిటల్ బుక్ కార్యకర్తలకు భరోసాగా ఉంటుందన్నారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, అరెపల్లి లక్ష్మి, బొమ్మాళి రూప, కోరుకొండ శంకరబాబు, నిక్కు రాజశేఖర్, పారశెల్లి తేజేశ్వరరావు, తాడేల దాస్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మజ్జి గోపాలకృష్ణ, చిత్రంలో చింతాడ రవికుమార్



కెళ్ల సురేష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పొందూరు: తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌తోపాటు పొందూరు మండలానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల ముఖ్య నాయకుడు మజ్జి గోపాలకృష్ణ జగన్‌మోహన్‌రెడ్డిని కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కెళ్ల సురేష్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నాయకులంతా కలిసి మండలంలోని రాజకీయ అంశాలను జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు కంబాపు సూర్యారావు, వండాన సూరప్పనాయుడు, గాడు నాగరాజు, గుడ్ల మోహన్, మొకర శంకరరావు, మజ్జి సన్యాసినాయుడు, జగదీశ్వరరావు, తదితరులు ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సెక్షన్ అధికారి ఈశ్వరరావు

సారవకోట: వన్యప్రాణులను సంరక్షించాలని అటవీశాఖ సారవకోట సెక్షన్ అధికారి ఎల్.ఈశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కొన్ని సమయాలలో సమీపంలో ఉన్న కొండల నుంచి అడవి జంతువులు గ్రామాల్లోకి వస్తుంటాయన్నారు. అటువంటప్పుడు వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని మరలా అడవిలో విడిచి పెడతామన్నారు. వన్య ప్రాణులను సంరక్షించడం వలన జీవ వైవిధ్యం జరుగుతుందని, ప్రతిఒక్కరూ వన్యప్రాణులను కాడాలన్నారు. బీట్ అధికారులు శివకుమార్, పృథ్వీ పాల్గొన్నారు.

అధ్వానం..



సరుబుజ్జిలి మండలంలోని అగ్రహారం నుంచి దబ్బపాడు వరకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలోనే రైతులు తమ పంట పొలాలకు వ్యవసాయ పరికరాలు తీసుకెళ్లాలి. సరైన రహదారిలేక సుదూర ప్రాంతం వెళ్లి పొలాలకు చేరుకొంటున్నారు. అధికారులు రహదారిని బాగుచేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

వంద గంటల నామ సంకీర్తన



నామ సంకీర్తన నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్‌లోని సత్యసాయి బాబా మందిరంలో లోక కల్యాణార్థం వంద గంటల నామ సంకీర్తన బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. సత్యసాయి బాబా 100వ జన్మదిన వేడుకలు సందర్భంగా ఈ వంద గంటల నామ సంకీర్తన ప్రారంభించినట్లు మందిరం కన్వీనర్ ఎం.ఎల్.నాయుడు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు నామసంకీర్తన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 25 భజన బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. ఉదయం మారుతీనగర్ ప్రాంతంలో నగర సంకీర్తన నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, ప్రతినిధులు అమ్మాయమ్మ, ముద్దాడ గోపాలరావు, జగ్గునాయుడు, సామి రామకృష్ణ, పొట్నూరు మోహన్‌రావు, సి.హెచ్.ఉమామహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

189 మందికి రెయిన్ కోట్లు పంపిణీ



గ్రీన్ అంబాసిడర్లకు రెయిన్ కోట్లు అందజేస్తున్న మోహన్‌రావు

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, నివగాం, మెట్టూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, భామిని మండం బాలేరు పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 180 మందికి సత్యసాయి భక్తుడు సాలూరు మోహన్‌రావు బుధవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కొత్తూరు మండలంలోని కర్లెమ్మ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న తొమ్మిది మంది గ్రీన్ అంబాసిడర్లకు కొత్తూరు సత్యసాయి మందిరం వద్ద రెయిన్ కోట్లు అందజేశారు. మోహనరావును ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆధ్యాత్మిక మండలి కొత్తూరు మండల కన్వీనర్ పొగిరి రవి, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ



తూటికాడ కషాయాన్ని తయారుచేస్తున్న రైతులు

కొత్తూరు: తూటికాడ కషాయంతో వరి పంటకు వచ్చిన దోమపోటును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. మండలంలోని కుంటిభద్ర గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వరి పంటను బుధవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున వరి పంటకు దోమలు ఆశిస్తున్నాయన్నారు. తూటికాడ కషాయాన్ని పిచికారీ చేయాలన్నారు. తూటికాడ కషాయం తయారీ, వినియోగించే విధానాన్ని రైతులకు వివరించారు. ఏటీఎం పద్ధతిలో సాగు చేస్తున్న కూరగాయల పంటలను పరిశీలించారు. బయో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కుంటిభద్రలో పరిశీలించారు. ఎంటీ సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలున్నాయ్ జాగ్రత్త



సరుబుజ్జిలి జంక్షన్లో కుక్కల గుంపు



కె.జె.పేట ప్రధాన రహదారిపై వాహనదారుల వెంటపడుతున్న కుక్కల గుంపు



పాలవలస వద్ద సంచరిస్తున్న కుక్కలు

- గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు
- భయపడుతున్న వాహనదారులు
- నివారణ చర్యలు చేపట్టాలని విన్నపం

సరుబుజ్జిలి: కుక్కలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రీ, పగలూ తేడా లేకుండా గుంపులు, గుంపులుగా రోడ్లపై సంచరించడం వలన ఆరుబయటకాలు మోపేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల్లో ఇటీవల మనుషులు, పశువులను గాయపరిచిన ఉదంతాలు అనేకం ఉన్నాయి.

బాధితులు..

సరుబుజ్జిలి మండలంలోని చిగురువలసలో ఓ మూగ బాలికపై ఇటీవల కాలంలో కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. కె.జె.పేట, యరగాం, పెద్ద మాలపేట, అగ్రహారం, తెలికిపెంట గ్రామాల్లో మహిళలు, వృద్ధులపై కుక్కలు దాడి చేశాయి. బూర్జ మండలం కె.కె.రాజపురం, వైకుంఠపురం, కొల్లివలస, పాలవలస, ఎన్నిరామన్నపేట, అంపిలి గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. ఆమదాలవలస మండలం తమ్మయ్యపేట, కంచరాపువానిపేట, దూసి, బెలమాం, కణుగులవలస గ్రామాల్లో కుక్కల దాడి ఘటనలు ఇటీవల చోటు చేసుకున్నాయి. పొందూరు మండల కేంద్రంలో కుక్కలు గుంపులుగా తిరగడంతో ప్రజలు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

వాహనదారులపై దాడులు..

రహదారిలో వెళుతున్న వాహనదారులను కూడా కుక్కల గుంపు విడిచిపెట్టడం లేదు. ద్విచక్ర వాహనదారులు వెళుతున్న సమయంలో ఒకేసారి వారిపై దాడి చేయడం వలన భయానికి కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇటీవల కాలంలో పురుషోత్తపురం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులపై కుక్కలు దాడి చేశాయి.

కుక్కల నియంత్రణ చర్యలు శూన్యం

వందలాది కుక్కలు గ్రామాల్లో గుంపుగా తిరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కుక్కల సంతానం వృద్ధి జరగకుండా స్పెషల్ డ్రైవ్ చేయకపోవడ వలన విపరీతంగా పెరుగుతన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో అనధికారకంగా కుక్కలను వాహనాల్లో దించి వెళ్లిపోతున్నట్లు పలువురు చెబుతున్నారు. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాలపై వెళ్లేందుకు భయమేస్తోంది



ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళ్లే సమయంలో కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే సమయంలో విద్యార్థులకు కుక్కల బెడద అధికంగా ఉంటుంది. ఒంటరిగా వెళ్లేందుకు భయమేస్తోంది.

– ప్రత్తిపాటి ప్రసాదరావు, నందికొండ కాలనీ, సరుబుజ్జిలి మండలం

చర్యలు తీసుకోవాలి



కుక్కల గుంపుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద కాపుకాచి దాడులకు తెగబడుతున్నాయి. పిచ్చి కుక్కల కరిస్తే ప్రాణాలకే ప్రమాదం. చిన్నపిల్లల విషయంలో మరింత భయమేస్తోంది.

– సవర గీత, వెన్నెలవలస, సరుబుజ్జిలి మండలం

నివారణ చర్యలు చేపడతాం

గ్రామాల్లో కుక్కల నివారణకు సత్వర చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాం. సంతానం వృద్ధి జరగకుండా వెటర్నరీ వైద్యులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– బి. రామారావు, ఈఓపీఆర్డీ